క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై రజియా సుల్తానా

నాగులుప్పలపాడు: మండలంలోని రౌడీషీటర్లకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఐ రజియా సుల్తానా కౌన్సిలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందస్తుగా వారందరినీ బైండోవర్ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టార్గెట్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఒంగోలు రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్

ఒంగోలు సిటీ: ఒంగోలు మండలానికి ఇచ్చిన 1430 కార్డుల టార్గెట్‌ను త్వరగా పూర్తిచేయాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందిని ఒంగోలు రూరల్ తహసీల్దారు నాయబ్ రసూల్, ఒంగోలు అర్బన్ తహసీల్దార్ మధుసూదన్‌రావు ఆదేశించారు. సోమవారం ఒంగోలు తహసీల్దారు కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బందికి పంట సాగు పత్రాల మంజూరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి కౌలు రైతు తప్పకుండా సీసీఆర్‌సీ కార్డు పొంది ఉండాలని తెలిపారు. పంట సాగుదారుని హక్కు పత్రం కావాలనుకున్న వారు భూయజమాని పొలం పాస్ బుక్కు జెరాక్స్, కౌలు రైతు ఆధార్ కార్డుతో గ్రామ రెవెన్యూ అధికారికి భూ యజమాని సంతకంతో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్డుతో కౌలు రైతులకు విత్తనాల సబ్సిడీకి, బ్యాంకు నుంచి రుణం పొందడానికి, పంట నష్టం జరిగినప్పుడు నష్టపరిహారం పొందడానికి, పండిన పంటను అమ్ముకోవడానికి, పంట నమోదు చేయించుకోవడానికి రైతులు అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో ఏవో కిషోర్‌బాబు, రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీకి సన్మానం



నెమలిదిన్నె చెన్నారెడ్డిని సన్మానిస్తున్న కంభం మండల నాయకులు

కంభం: వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీగా నియమితులైన నెమలిదిన్నె చెన్నారెడ్డిని సోమవారం కంభం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకుడిని గుర్తించి రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వడం హర్షణీయమన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.


మండల సరిహద్దుల వద్ద బోర్డుల ఏర్పాటు



సరిహద్దు బోర్డులు పాతిస్తున్న ఎస్సై నాగరాజు

కొమరోలు: మండల సరిహద్దు తెలియజేసే బోర్డులను కొమరోలు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కడప – ప్రకాశం జిల్లాల బార్డర్‌లోని తిమ్మారెడ్డిపల్లె గ్రామం వద్ద, అమరావతి–అనంతపురం జాతీయ రహదారిలోని ముత్రాసుపల్లె గ్రామం వద్ద అలసందలపల్లె సమీపంలో హైవేపై బోర్డులను పాతించారు. కొమరోలు పోలీసుస్టేషన్ పరిధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండేందుకు బోర్డులు ఏర్పాటు చేయించినట్లు ఎస్సై తెలిపారు.

జేఈఈలో 'ఆల్ఫా' పూర్వ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంభం: ఆల్ఫా హైస్కూల్లో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ రితీష్ నాయర్ హర్షం వ్యక్తం చేశారు. ఆలిండియా స్థాయిలో ప్రకటించిన ఫలితాల్లో ఎం.రవించంద్ర ఆలిండియా 8వ ర్యాంక్, బీఏ అగస్టిన్ ఆలిండియా 3,282వ ర్యాంక్, ఎస్.ఇంద్రసేనారెడ్డి ఆలిండియా 3,292వ ర్యాంక్, జె. నరేంద్ర ఆలిండియా 5,941వ ర్యాంక్ సాధించిన సందర్భంగా సోమవారం ఆల్ఫా హైస్కూల్లో ఘనంగా సత్కరించి అభినందించారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి

- సీఎం చంద్రబాబు మోసపూరిత పాలనను ఎండగట్టాలి
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపు



చంద్రపాడు గ్రామంలో పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు



పేర్నమిట్టలో వెన్నుపోటు దినం పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, దుంపా చెంచిరెడ్డి, నాయకులు

సంతనూతలపాడు: సీఎం చంద్రబాబు మోసపూరిత పాలనపై కలసికట్టుగా ఉద్యమిద్దామని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ సంతనూతలపాడు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించతలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ పోస్టర్లను పార్టీ సంతనూతలపాడు మండల నాయకులతో కలిసి సోమవారం పేర్నమిట్టలోని ఆయన నివాసంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసకారి అయిన చంద్రబాబు ఏడాది పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేయకుండా వంచిస్తూ వచ్చారన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపుతూ ఏపీని అప్పుల ఊబిలోకి నెట్టేసి తన వ్యక్తిగత ఖజానా నింపుకుంటున్నారని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా వారిని మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

తొలి ఏడాదిలోనే 90 శాతానికిపైగా మేనిఫెస్టో అమలు చేసిన వైఎస్ జగన్...

2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 90 శాతానికిపైగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని బత్తుల బ్రహ్మానందరెడ్డి గుర్తుచేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు కొనసాగించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయపెట్టేందుకు యత్నిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేసిందిగాక.. సిగ్గులేకుండా మహానాడులో పచ్చి అబద్ధాలు వల్లెవేయించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలను నమ్మించి మోసగించారన్నారు. కనీసం ఉపాధి కూలీల బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. ఎండీయూ విధానం ద్వారా రేషన్ పంపిణీని రద్దు చేయడంతో ఎంతోమంది ఉపాధి కోల్పోయారన్నారు. ప్రజలపై విద్యుత్ భారం పెంచి, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటేలా చేశారని మండిపడ్డారు. ఏపీలో జీఎస్టీ వసూళ్లు పడిపోయాయని, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయిందని, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ఇటీవల కాగ్ తన నివేదికలో ఈ విషయాలన్నీ స్పష్టం చేసిందన్నారు. మోదీ వద్ద ఇప్పటి వరకు విభజన హామీల ప్రస్తావనను సైతం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ లేవనెత్తలేదన్నారు. దగాకోరు పాలనపై ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు బత్తుల పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, మున్సిపల్ వింగ్ నాయకుడు రావూరి శ్రీనివాసరెడ్డి, జిల్లా యూత్ సెక్రటరీ గాంధ్ల పెద్దబాబు, సంతనూతలపాడు మండల ట్రేడ్ యూనియన్ నాయకుడు కాకి రవి, మండల ప్రచార కమిటీ నాయకుడు తేళ్ల అనిల్‌కుమార్, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు తేళ్ల సుబ్బారావు, పరసాచిన ఆదాము, టి.బ్రహ్మారెడ్డి, దాసరి రామారావు, గాజుల ఆంజనేయులు, పతకమూరి చెంచయ్య, నూతలపాటి వెంకట్రావు, నూకతోటి శ్రీను, తనిపర్తి శేషిరెడ్డి, నూకతోటి రాజేష్, చెల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రపాడులో పోస్టర్లు ఆవిష్కరించిన మేరుగు నాగార్జున...

చీమకుర్తి రూరల్: మండలంలోని చంద్రపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ వెన్నుపోటు దినం పోస్టర్లను ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 4న సంతనూతలపాడులో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదని, సీఎం చంద్రబాబు వైఫల్యాలను ప్రజల్లో ఎండగడదామని ఆయన అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంతనూతలపాడులో ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు భారీగా పాల్గొనాలని కోరారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: సంతనూతలపాడు మండల కేంద్రంలో ఈ నెల 4న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి నాగులుప్పలపాడు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పార్టీ సీనియర్ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ పిలుపునిచ్చారు. వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం నాగులుప్పలపాడులోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పోకూరి లక్ష్మి, నాయకుడు పోకూరి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: సంతనూతలపాడులో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి మద్దిపాడు మండలం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పార్టీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

కార్యక్రమంలో నాయకులు మండల బాలచంద్రమౌళి, పైడిపాటి వెంకట్రావు, బొమ్మల రామాంజనేయులు, పల్లపాటి అన్వేష్, నాదెండ్ల మహేష్, మంద చిన్న, వినోద్, సింగయ్య, జయమ్మ, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మద్దిపాడులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పార్టీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాయకులు

వైఎస్సార్ సీపీ చంద్రపాడు గ్రామ కమిటీ ఎంపిక



వైఎస్సార్ సీపీ చంద్రపాడు గ్రామ నూతన కమిటీతో మాజీ మంత్రి మేరుగు నాగార్జున, మండల నాయకులు

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో చంద్రపాడు గ్రామ పార్టీ నూతన కమిటీని సోమవారం ఎంపిక చేశారు. అధ్యక్షునిగా వల్లంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కంజుల వెంకటరెడ్డి, మోపూరి కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నామేపల్లి శంకర్, పులి బ్రహ్మయ్య, కార్యదర్శులుగా జి.ప్రసాదరావు, డి.విక్రమ్, కొమ్ము రవి, తిరగబత్తిన శ్రీను, కొమ్ము సింగయ్య, కార్యవర్గ సభ్యులుగా వీరాంజనేయులు, ఈర్ల సుబ్బారావు, నామేపల్లి మల్లికార్జున, కోటు రాంబాబు, చెన్నారపు రమణయ్య, వల్లంరెడ్డి కోటిరెడ్డి, యూత్ అధ్యక్షుడిగా వల్లంరెడ్డి మోహన్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడిగా బొల్లంరెడ్డి కృష్ణారెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడిగా చిలిపి విశ్వనాథరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నాబత్తిన శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా స్వర్ణ హనుమంతరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పల్లంరెడ్డి రమణమ్మలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు యన్నం శేషురెడ్డి, చీదర్ల శేషు, గ్రామ నాయకులు వాకా సంజీవరెడ్డి, దుద్దుకూరి వెంకారెడ్డి, యూత్ అధ్యక్షుడు ఎస్.వెంగారెడ్డి, చిన్నపరెడ్డి మస్తాన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలు పి.శ్రీనివాసరెడ్డి, పి.నాగేశ్వరరావు, రైతు విభాగం అధ్యక్షుడు నల్లూరి రామచంద్ర, బీసీ సెల్ అధ్యక్షుడు గంగిరేకుల వెంకటరావు, ఆర్.టి.ఐ విభాగ అధ్యక్షుడు బొంత సంతోష్, జిల్లా నాయకుడు కూడలి మాలకొండయ్య, డాక్టర్ బొడ్డపాటి హరిబాబు, సర్పంచులు కొమ్ము ఏలయ్య, మక్కెన రాజేంద్రకుమార్, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయాలు చూసుకోవాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



జనపనార సంచులను ప్రదర్శిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, కాలుష్య నియంత్రణ మండలి అధికారి రాఘవరెడ్డి, తదితరులు

ఒంగోలు సబర్బన్: ప్లాస్టిక్ కవర్లు వాడకుండా వాటి స్థానంలో జనపనార సంచులుగానీ, గుడ్డసంచులుగానీ వాడాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఒంగోలు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జనపనార సంచులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి ఒంగోలు ప్రాంతీయ కార్యాలయం నుంచి ఉచితంగా పంపిణీ చేస్తున్న జనపనార సంచులను ప్రజలంతా వాడాలన్నారు. జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగిల్ ప్లాస్టిక్ వాడకం వలన నష్టాలు, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కళాజాత బృందం ద్వారా ప్లాస్టిక్ వలన పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్రజలందరూ పర్యావరణ హిత ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలని ప్రదర్శించిన వీధి నాటిక ప్రయాణికులను ఆలోచింపజేసింది. అనంతరం ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై రైల్వే శాఖ సహకారంతో ర్యాలీ నిర్వహించి రైల్వే స్టేషన్ ముందు గల పార్క్‌లో 10 జీవవైవిధ్యానికి సంబంధించిన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్మెంటల్ ఇంజినీరు రాఘవరెడ్డి, రైల్వే శాఖ హెల్త్ ఇన్‌స్పెక్టర్ నందకిషోర్, సిబ్బంది, ప్రాజెక్ట్ సంస్థ కార్యదర్శి శరణం చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పరాంకుశం సేవలు అభినందనీయం



శ్రీనివాసమూర్తి దంపతులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: ఆర్టీసీలో పరాంకుశం శ్రీనివాసమూర్తి 40 సంవత్సరాల పాటు అందించిన సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ నిర్వాహకులు కొనియాడారు. చీమకుర్తికి చెందిన పరాంకుశం శ్రీనివాసమూర్తి గత నెల 31న ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం రాత్రి చీమకుర్తిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రోటరీక్లబ్ నిర్వాహకులతో పాటు పలువురు హాజరై ఆర్టీసీ డిపార్టుమెంట్‌లో కండక్టర్‌గా, ఇతర పోస్టులలో ప్రయాణికుల మన్ననలు అందుకున్న శ్రీనివాసమూర్తి.. కళారంగంలో సైతం సేవలందించారని కొనియాడారు. అనంతరం శ్రీనివాసమూర్తి దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ వ్యవస్థాపకులు చెరుకూరి రఘుకిరణ్, ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కే సుధాకర్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు యడ్లపల్లి రామబ్రహ్మం, మన్నం ప్రసాద్, అంబటి వీరారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు, చలువాది బదరీనారాయణ, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న సీఐ సురేష్

గిద్దలూరు రూరల్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని స్థానిక సీఐ కె.సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేంత వరకు శ్రమించాలని సూచించారు. ప్రధానంగా తల్లిదండ్రులు, గురువులపై వినయవిధేయలతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్యయాదవ్, యువప్రగతి సంస్థ అధ్యక్షుడు ఫరూక్, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న వాచ్‌మెన్లు, ఇస్త్రీదారుల సదస్సు



కరపత్రాలు విడుదల చేస్తున్న రజక వృత్తిదారుల సంఘ నాయకులు

ఒంగోలు సిటీ: ఒంగోలు నగరంలోని అపార్టుమెంట్లలో పనిచేస్తున్న వాచ్‌మెన్లు, ఇస్త్రీదార్ల సదస్సును ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు రజక వృత్తిదారుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చీమకుర్తి కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఒంగోలు ఎల్బీజీ భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి కల్లగుంట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ముందుగా సదస్సు కరపత్రం విడుదల చేశారు. అనంతరం చీమకుర్తి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వలసలు వచ్చి అపార్టుమెంట్లలో వాచ్‌మెన్లు, ఇస్త్రీదారులుగా, ఇంటి పనివారిగా ఇరుకు గదుల్లో చాలీచాలని వేతనాలతో ఎంతోమంది కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పది నుంచి 30 కుటుంబాలుండే అపార్టుమెంట్లలో వాచ్‌మెన్లకి రూ.6,500 నుంచి పది వేల దాకా మాత్రమే ఇస్తున్నారని, నలుగురు సభ్యులున్న కుటుంబాలు ఆ వేతనంతో బతకాలంటే కష్టతరంగా ఉందని అన్నారు. రజక వృత్తిదారుల సంఘ జిల్లా కార్యదర్శి రాయల మాలకొండ మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్తులో అపార్టుమెంట్ అసోసియేషన్ అభివృద్ధి కావడానికి తోడ్పడతామన్నారు. ఎల్బీజీ భవనంలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణయ్య, చందలూరు శ్రీనివాసులు, పాదర్తి ఆంజనేయులు, కన్నవరపు నాగేశ్వరరావు, నాగేశ్వరరావు నాయక్, శోభన్‌బాబు, కే బాలు, ఎస్.శ్రీనివాసులు, ఎం.ఏడుకొండలు, జటావత్ జక్యానాయక్, ఆరు బాబు, బూచిరాజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం



మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మద్దిపాడు: మలేరియా జ్వరం రాకుండా ఉండేందుకు దోమలు పుట్టకుండా, కుట్టకుండా మండలంలోని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మద్దిపాడు ఆస్పత్రి డాక్టర్లు ఆనంద్ మోహన్, శ్రావణ్ సూచించారు. మద్దిపాడులో వైద్య సిబ్బందితో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ నెలలో గ్రామాల్లో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంటింటికి సర్వే నిర్వహించడం, ఆ సర్వేలో ఎక్కడైనా లార్వా కనిపిస్తే వాటిని స్టాక్ సొల్యూషన్ ద్వారా మట్టుపెట్టడం చేయాలన్నారు. గ్రామ సర్పంచ్, సెక్రటరీ సహకారంతో దోమలు అభివృద్ధి చెందకుండా ప్రతి గ్రామాన్ని చూసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రతి వైద్య శాఖ ఉద్యోగి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. తద్వారా దోమలను నిర్మూలించడంలో ముఖ్యపాత్ర పోషించాలని తెలిపారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, చికున్ గునియా, బోదకాలు, మెదడువాపు వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకుని దోమల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా ఆఫీస్ సభ్యులు శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ లలితమ్మ, రజిత, హెచ్‌వీలు నాగరాజి, సీతమ్మ, సూపర్‌వైజర్ బాలకోటయ్య, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, బీఎస్సీ నర్సింగ్ ట్రైనీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి

మార్కాపురం టౌన్: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోడి రామ్మూర్తి క్రీడా శిక్షణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ తరగతుల ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడా శిబిరాలకు పంపాలన్నారు. శాప్ బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణు, సంఘంవ్యవస్థాపక కార్యదర్శి కాళంగి శ్రీనివాసులు మాట్లాడుతూ.. క్రీడా కోటాలో 3 శాతం రిజర్వేషన్ ఉందని, విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి చూపాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏకపాత్ర, కర్రసాము తదితర క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి అబ్బురపరిచారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవరావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలోకి పార్టీని తీసుకెళ్లాలి

మార్కాపురం: క్షేత్ర స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కుమారస్వామి, జాతీయ కార్యదర్శి ఎస్.సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలోని వివేకానంద విద్యాపీఠంలో జిల్లా కిసాన్ మోర్చ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామస్థాయిలో కిసాన్ మోర్చా కమిటీలు ఏర్పాటుచేయాలని సూచించారు. బీజెపి జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, పార్టీ నాయకులు శాసనాల సరోజిని, పీవీ కృష్ణారావు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మార్కాపురం బస్టాండ్‌ను ఆయన డిపో మేనేజర్ నరసింహులుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్‌లో తినుబండారాలు, టీ, కాఫీలాంటివి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు సూచించారు. త్వరలో కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో కొత్త నియామకాలు లేకపోవడంతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందన్నారు. ప్రతి డిపోలో వారంలో ఒకరోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులకు సూచించారు. కరోనా వ్యాపిస్తున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని చెప్పారు. బస్టాండ్లలో కాంట్రాక్టు తీసుకున్నవారు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయనను ప్రయాణికుల సంఘం నాయకులు ఓఎ మల్లిక్, ఆర్‌కేజే నరసింహం కలిశారు. బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.